

ఉద్యమం.. ఉధృతం

- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం - రెండవ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె


చిత్తూరు సిడిపిఓ ఆఫీసు ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అపరిస్కృతంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా సిఐటియుసి, ఏఐటీయూసీ, ఐఎఫ్‌ఎస్సి నేతత్వంలో చేపట్టిన సమ్మె బుధవారానికి రెండో రోజుకు చేరుకుంది. జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు పెద్దసంఖ్యలో సమ్మెలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రమైన చిత్తూరు సిడిపిఓ కార్యాలయం, యాదమరి మండలం తహశీల్దార్ కార్యాలయాలు ఎదుట అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. న్యాయమైన తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చే అంతవరకు సమ్మె కొనసాగుతుందని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా స్పష్టం చేశారు. జిల్లాలోని దాదాపు అన్ని ప్రాజెక్టులలో అంగన్వాడీలు రెండవ రోజు సమ్మెలో పాల్గొన్నారు. కుప్పం, శాంతిపురం, వీకోట, పుంగనూరు, పలమనేరు, జీడీ నెల్లూరు, బంగారుపాలెం, ఐరాల, పాలసముద్రం, కార్వేటి నగరం లాంటి ప్రాంతాల్లో అంగన్వాడీలు సమ్మె విజయవంతం చేశారు. కుప్పం, వీకోట, శాంతిపురం, పుంగనూరు ప్రాంతాల్లో జరిగిన అంగన్వాడీల నిరసన కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన అంగన్వాడీల నిరసనలు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య, సురేంద్ర పాల్గొని సంఘీభావం తెలిపారు.

నేటి నుండి సమ్మె ఉధృతం

సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టియు అంగన్వాడీ యూనియన్ల సంయుక్త పిలుపుమేరకు గురువారం నుండి అంగన్వాడీలు సమ్మెను ఉధతం చేయనున్నారు. 14,15వ తేదీల్లో ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీల సంఘీభావం 16వ తేదీ కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకొని మోకాళ్ళపై నిలబడి నిరసన, 17 ప్రీస్కూల్ పిల్లలు, గర్భవతులు, బాలింతలతో అంగన్వాడీలకు సంఘీభావం తెలుపుతూ నిరసన, 18వ తేదీ మానవహారాలు, 19వ తేదీ రాస్తారోకోలు, 20వ తేది వంటావార్పు, 21వ తేదీ భిక్షాటన, 22వ తేదీ రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు.

గంగవరం: పలమనేరు పట్టణంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ సభ్యులు బుధవారం సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా నాయకులు డివి మునిరత్నం, వేలయుధం, పార్థసారథి, మనీ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు ఎన్నో ఏళ్ల నుండి ఐసిడిఎస్‌ను కాపాడుకోవడానికి అహర్నిశలు కషి చేశారని అలాంటివారికి కనీసవేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వాలు మొండిగా వ్యవహరించడమే కాకుండా వారిని శ్రమ దోపిడికి గురి చేస్తూ హక్కులను హరించడమేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంబించడం వలన కార్మికులు హక్కుల కోసం వీధి పోరాటాలు చేస్తున్నారని పేర్కొన్నారు. రవికుమార్, సోము, సుబ్రహ్మణ్యం, శ్యామల, బాలాజీ, ఆనంద, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండల కార్యాలయం ప్రాంగణంలో అంన్వాడీల చేపట్టిన నిరవధిక సమ్మె రెండవ రోజు కొనసాగింది. జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పొన్న యుగంధర్ కార్యకర్తల తో కలిసి దీక్షా శిబిరానికి చేరుకుని వారికి మద్దతు తెలిపారు. అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం స్పందించి వెంటనే చట్టబద్ధంగా అమలు చేయాలని కోరారు.

గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు, పెనుమూరు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వెంకటేష్, మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, జిల్లా యాదవ సాధికార మహిళా అధ్యక్షురాలు గాయత్రి యాదవ్‌లతో పాటు పలువురు టిడిపి నేతలు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. యూనియన్ నేతలు గోవిందమ్మ, వాణి, బాను, మాధవి, నదియా, గీత, హంసవేణి, పవన, అరుణ పాల్గొన్నారు.

పుంగనూరు: అంగన్వాడీలు న్యాయమైన కోర్కెల సాధన కోసం చేస్తున్న నిరసనలకు బీసీవై పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు పార్టీ చీఫ్ బోడె రామచంద్ర యాదవ్ చెప్పారు. ఐసిడిఎస్ కార్యాలయం వద్ద రెండో రోజు నిరవధిక సమ్మె బుధవారం నిర్వహించారు. పుంగనూరులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలకు భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధ్యక్షుడు బొడె రామచంద్ర యాదవ్ మద్దతు తెలిపారు. ఆయన దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు.

అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు సిఐటియు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు న్యాయమైన కోరికలు తీర్చకుండా వారిని వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తున్నట్లు అనిపించారు. వెంటనే ప్రభుత్వ స్పందించి వారి న్యాయమైన కోర్కెలను తీర్చడానికి డిమాండ్ చేశారు.

యాదమరి: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం రెండవ రోజు మండల కేంద్రమైన యాదమరి తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి మద్దతుగా టీడీపీ మండల అధ్యక్షులు మొరార్జీ, ప్రధాన కార్యదర్శి రబ్బి మహిళ అధ్యక్షురాలు చిత్ర, అధికార ప్రతినిధి వల్లే రమ్మన్నాద నాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు గుణశేఖర్, కమలనాథన్ గజేంద్ర మద్దతు తెలిపారు.

కుప్పం: ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో కుప్పంలో ప్రాజెక్టులో రెండవరోజు సమ్మె ప్రారంభించారు. ఈసందర్భంగా ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కెపి.లలితలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను ఎలా భగ్నం చేయాలని అధికారులతో ఒత్తిడి చేస్తున్నదే తప్ప సమస్యలు ఎలా పరిష్కారం చేద్దామనే ఆలోచనలో లేకపోవడం దుర్మార్గమన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు బాలసుబ్రమణ్యం, ప్రాజెక్టు నాయకులు సరళ, కస్తూరి, ఐఎఫ్టియు మహాలక్ష్మీ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: అంగన్వాడీల సమ్మెకు తెలుగుదేశం ఇంచార్జ్ పూతలపట్టు నియోజకవర్గం ఇంచార్జ్ మురళీమోహన్ మద్దతు తెలిపారు. అలాగే యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత, టిడిపి మండల అధ్యక్షులు మొగిలయ్య, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, లోకనాథం నాయుడు, జనార్ధన్ గౌడ్, శివ కమల్‌నాథ్ రెడ్డి, సుదర్శన నాయుడు మద్దతు తెలిపారు.


వికోటలో


యాదమరిలో


వెదురుకుప్పంలో


శాంతిపురంలో


పుంగనూరులో


కుప్పంలో


జీడీ నెల్లూరులో


బంగారుపాళ్యంలో

- పల్లెసీమలో ఏనుగుల కలవరం
- జిల్లా రాశిమూలన చేరి రంకెలేస్తున్న మంద
- నిత్యం గజ ఘీంకారాలతో అన్నదాత ఆందోళన
- పంటలు కాపాడుకొనేందుకు రాత్రింబవళ్లు జాగారం
- అందలమెక్కి ఆదుకోవడం లేదంటూ అమాత్యులపై ఆగ్రహం
- అటవీశాఖ మంత్రి ఇలాకాలో భీకర బీభత్సం
- మాజీ ముఖ్యమంత్రైనా పట్టించుకోలేదంటూ ఆరోపణలు
- అధికారులు, పాలకులపై విమర్శల వెల్లువ



కారడవిని వీడి.. జనారణ్యంలోకి..!

కీకారణ్యంలో ఉండాల్సిన ఏనుగుల మంద.. ఊళ్లు.. పంటలపై దూసుకొచ్చి విధ్వంసం సృష్టిస్తున్నాయి. పొలాలను తొక్కేస్తూ.. రైతులను చంపేస్తూ పల్లెసీమలను కలవర పెడుతున్నాయి. సత్యమంగళం అడవుల నుంచి వేర్వేరుగా విడిపడి.. గుంపు గుంపులుగా శేషాచలం, కౌండిన్యా అటవీ ప్రాంతాల్లో తిష్టవేశాయి. గత ఏడాది శేషాచల అటవీ పరివాహక ప్రాంతాల్లోని తిరుపతి, పిచ్చాటూరు, నాగలాపురం, చంద్రగిరి తదితర ప్రాంతాల్లో దాడులు చేశాయి. ఈ ఏడాది కౌండిన్య అటవీ ప్రాంతాన్ని ఆవాసంగా మార్చుకొని గుంపుల్లో విడిపడి తిరుపతి జిల్లా పాకాల మొదలుకొని చిత్తూరు జిల్లా పుంగనూరు, పూతలపట్టు, కుప్పం, పలమనేరు నియోజకవర్గ ప్రాంతాల్లో బీభత్సం సృష్టిస్తున్నాయి. చేతికొచ్చే పంటలను నాశనం చేస్తుంటే అన్నదాతలు లభోదిబోమంటూ విలపిస్తున్నారు. ఎదురుపడ్డ రైతులు, పశువుల కాపరులను చంపేస్తుండటంతో స్థానికులు హడలెత్తిపోతున్నారు. అటవీశాఖ మంత్రి, మాజీ ముఖ్యమంత్రి ఇలాకాలో ఏనుగుల దాడులు కొనసాగుతూ తీవ్రనష్టం కలిగిస్తుండటంతో వారి నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. **- ప్రజాశక్తి-వికోట**

సరిహద్దుల్లో గజగజ..

కర్నాటక, తమిళనాడు, ఆంధ్ర సరిహద్దులో సోమవారం 50-60 ఏనుగుల మంద హోసూరు నుంచి వచ్చినట్లు కలకలం రేగింది. ఇప్పటికే పుంగనూరు ప్రాంతంలో ఓ ఏనుగుల గుంపు, రామకుప్పం వద్ద రెండు ఏనుగులు, బంగారుపాళ్యం వద్ద మరో గుంపు ఉన్నట్లు తెలుస్తోంది. ఇవికాక మరో ఏనుగుల మంద వచ్చిందన్న సమాచారంతో సరిహద్దు ప్రాంతంలో పంటలు పండించిన రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పల్లెల్లో ఏనుగులొస్తున్నా యంటూ భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల కదలికలు ఉండడంతో అధికారులూ అప్రమత్తం అయ్యారు.

పంటలపై కొనసాగుతున్న దాడులు..

నిత్యం పంటలపై ఏనుగులు దాడులు చేసి నాశనం చేస్తూ రైతులను ముంచేస్తున్నాయి. అరటి, వరి, టమోటా, బొప్పాయి, మామిడి, మొక్కజొన్న తోటల్లో స్వైర విహారం చేస్తున్నాయి. ఇవి కాక డ్రిప్‌పైపులు, పైపులు వంటివి ధ్వంసం చేస్తున్నాయి. నిత్యం పొలాల్లో దాడులు జరుగుతుండటంతో రైతులు పంటలను కాపాడుకోలేక, ఇటు ఏనుగుల గుంపును మళ్లించలేక రాత్రింబవళు జాగారాలు చేయాల్సి వస్తోందని కన్నీరుమున్నీరవుతున్నారు.

ప్రశ్నార్థకంగా ఎలిఫెంట్ శాంక్చురీ..

పలమనేరు, కుప్పం, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలో 360 చదరపు కిలోమీటర్లు, విస్తీర్ణంలో 88400ఎకరాల్లో కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురీని 1990లో ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం ఏనుగుల సంచారానికి సురక్షితమని అధికారులు గుర్తించారు. అందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ నిర్వహణ లోపం వల్ల గజరాజులు అటవీ ప్రాంతాలను వీడి పంటలపైకి దూసుకొస్తున్నాయి. గడిచిన 30ఏళ్లలో సుమారు 60మందికి పైగా గజదాడుల్లో మృత్యువాత పడినట్లు అటవీశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

పరిష్కార మార్గానికి తగదిక ఆలస్యం..

వెనువెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పరిష్కార మార్గాన్ని అన్వేషించకుంటే ముప్పు తప్పేలా లేదని విశ్లేషకుల భావన. ప్రజలను, పంటలను, ఏనుగలను కాపాడటం నిత్యకృత్యం. పెద్ద ఎత్తున కుంకీ ఆపరేషన్ చేపట్టి ఏనుగుల గుంపును అటవీ ప్రాంతాల్లో పంపాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. పంట పొలాలపైకి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ వంటివి ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏనుగులకూ తప్పని మరణాలు..

పంటపైకి వస్తున్న ఏనుగులు విద్యుత్ షాక్ తగిలి మృత్యువాత పడుతున్నాయి. మరికొన్ని గాయాలపాలై.. ఇంకొన్ని వివిద కారణాలతో మరణిస్తున్నాయి. ఏనుగులు వరుస మరణాలు వాటి భవిష్యత్‌కు కూడా ముప్పే..

అమాత్యులపై ఆరోపణల వెల్లువ..

జిల్లాలో బలమైన, సీనియర్ మాజీ ముఖ్యమంత్రి, మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా.. ఏనుగుల దాడులపై పట్టించుకోకపోవడం శోచనీయమంటూ కర్షకులు కుంగిపోతున్నారు. కోరిన ప్రతిసారీ అందలమెక్కిస్తున్నా.. ఆపదలో ఆదుకోకపోతున్నారని మండిపడుతున్నారు. నెలల తరబడీ గజ దాడుల్లో అపార నష్టం జరుగుతుంటే.. కంటితుడుపు చర్యగా కొంత ఇచ్చి ఆర్భాటం చేస్తున్నారని రైతులు దుమ్మెత్తిపోస్తున్నారు. మాజీ సీఎం ఇలాకా కుప్పం.. అటవీశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరులోనూ అన్నదాతలో అసహనం వక్త్యమవుతోంది.


ఏనుగుల దాడిలో దెబ్బతిన్న వరిపైరు



గజ దాడుల్లో ధ్వంసమైన అరటితోట

అప్పులు చేసి పంటలేశాం.. కోత దశలో నష్టపోయాం..




అటవీ సరిహద్దులో మా పొలం ఉంది. అప్పులు చేసి మూడు ఎకరాల్లో అరటి తోట వేశాం. చేతికందే దశలో ఏనుగుల దాడిలో నేలమట్టమైంది. రూ.10లక్షల మేరా నష్టం మిగిలింది. దీంతో పంటలు వేయాలంటేనే భయమేస్తోంది. వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్నాం. ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టి గజదాడులు నివారించాలి.
- సోము, నాగిరెడ్డిపల్లి, వికోట మండలం

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి



అటవీ సరిహద్దు గ్రామాలపై ఏనుగుల గుంపు స్వైరవిహారం చేస్తున్నాయి. మూడేళుగా టమోటా, బీన్, కాకర తదితర పంటలు చేతికందే దశలో నష్టపోయాం. ఎన్ని ప్రయత్నాలు చేసి పంటలు కాపాడుకోవాలన్నా ఆపలేకపోతున్నాం. ప్రభుత్వ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. వ్యవసాయాన్ని నమ్ముకున్న మమ్మల్ని ఆదుకోవాలి.
- కృష్ణమూర్తి, దానమయ్యగారిపల్లి, వికోట మండలం

తగు చర్యలు తీసుకుంటున్నాం..



పొలాలపై దాడులు చేస్తున్న ఏనుగుల గుంపును అడవుల్లోకి మళ్లించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. రాత్రి వేళల్లో రైతులు పొలాల వద్దకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏనుగులకు అడవిలో ఆహారం సమృద్ధిగా ఉంది. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే క్రమంలో ప్రజలు చేసే హడావుడి వల్ల దారిమళ్లి పంటలపైకి వస్తున్నాయి. పంట నష్టంకి సంబంధించి పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. నిధులు మంజూరైతే చెక్కులు అందిస్తాం. **- శివన్న, ఎఫ్ఆర్‌వో, పలమనేరు**

14న పలమనేరు, రామకుప్పం మండలాల్లో

కేంద్ర బృందం పర్యటన : కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసిటి) ఈ నెల 14న జిల్లాలోని పలమనేరు, రామకుప్పం మండలాలలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ షన్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిఏఎఫ్‌డబ్ల్యూ జాయింట్ సెక్రెటరీ పంకజ్ యాదవ్ నేతృత్వంలో 10 మందితో కూడిన బృందం జిల్లాలో వేరుశెనగ పంటను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర బృందం 14వ తేదీన ఉ. 10.30 గం.లకు పలమనేరు మండలం చేరుకుని శ్రీరంగరాజపురం, గుండ్లపల్లి గ్రామాల్లో, అనంతరం రామకుప్పం మండలంలోని గొర్రిమాకులపల్లి, బందార్లపల్లి గ్రామాలలో పర్యటించి వేరుశనగ పంటను పరిశీలించి మ.2.00 గం.లకు విజయవాడ బయలుదేరి వెళతారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు. బృందం సభ్యులుగా డైరెక్టర్ డిటిఈ ఆయిల్ సీడ్స్ డెవలప్మెంట్, హైదరాబాద్, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ వెల్ఫేర్ కె.పొన్నుస్వామి, డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్స్పెండీచర్ డిడి మహేష్ కుమార్,రూరల్ డెవలప్మెంట్ అండర్ సెక్రెటరీ కైలాష్ సంక్లా, కృష్ణ గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ పి. దేవేంద్ర రావు, ఎం ఎన్‌సిఎఫ్‌సి అసిస్టెంట్ డైరెక్టర్ డా.ప్రదీప్‌కుమార్, ఎస్‌టిపి రీజనల్ ఫాడర్ స్టేషన్ హైదరాబాద్, డిపార్ట్మెంట్ ఆఫ్ అనిమల్ హస్బెండరీ, డైరీయింగ్ అంజు బసెరా, సీనియర్ రిసెర్చ్ ఆఫీసర్,నీతి ఆయోగ్ అనురాధ బటాన, అసిస్టెంట్ అడ్వైజర్ డిపార్ట్మెంట్ ఆఫ్ డ్రింకింగ్ వాటర్ శ్యానిటేషన్, మినిస్ట్రీ ఆఫ్ జల్ శక్తి ఆర్ సంతోష్, అండర్ సెక్రెటరీ, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫుడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సంగీత్ కుమార్‌లు ఉన్నారు.

జనవరి 5న తుది ఓటర్ల జాబితా

- అన్ని ఫార్మాట్లకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా రెవెన్యూ అధికారి



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తీసివేతలకు సంబంధించి దరఖాస్తులు అందాయని, వాటికి సంభందించి ఈ నెల 26 వరకు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి జనవరి 5న పారదర్శక తుది ఓటర్ల జాబితా విడుదల చేయడం జరుగుతుందని జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.రాజశేఖర్ అన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎపిక్ కార్డులు పోస్టల్ కార్యాలయం నుంచి నేరుగా ఓటర్ల అడ్రస్‌కు వెళ్లడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తీసివేతలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో అత్యంత పారదర్శకంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఎస్పి ప్రతినిధి భాస్కర్, బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, కాంగ్రెస్ ప్రతినిధి పరదేశి, వైసిపి ప్రతినిధి ఉదయ్ కుమార్, టిడిపి ప్రతినిధి సురేంద్రకుమార్‌లు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా పారదర్శకంగా ఉండాలి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఓటర్ల జాబితాలో జంక్ క్యారెక్టర్లు, పదికిపైగా ఓటర్లు ఉన్న జాబితాలకు సంబంధించి వారం లోపు పూర్తి స్థాయిలో ముకేష్ కుమార్ మీనా తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా సచివాలయం నుండి జిల్లా జాయింట్ పి.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ జంక్ క్యారెక్టర్లు, పదికి పైగా ఓటర్లు ఉన్న జాబితాలకు సంబంధించి వారం లోపు ఈ కార్యక్రమం పూర్తి చేసి పారదర్శకంగా ఓటర్ల జాబితాను తయారు చేసే విధంగా చూడాలని సాంకేతిక పరమైన సమస్యలు ఉంటే వెంటనే ఎన్నికల కార్యాలయానికి పంపాలన్నారు. జిల్లాలో జంక్ క్యారెక్టర్లు, 10 పైగా ఓటర్లు ఉన్న అంశాలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలన జరుగుతున్నదని, ఈ అంశానికి సంబంధించి సాంకేతిక సమస్యలు ఉన్నాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి జాయింట్ కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో డి ఆర్ ఓ ఎన్. రాజశేఖర్, సూపర్డెంట్ బ్యుల తదితరులు పాల్గొన్నారు.

16న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లా కలెక్టరు, చిత్తూరు వారి ఆదేశాలు మీరకు "అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని" 16న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనం, మెసానికల్ గ్రౌండ్, చిత్తూరు నందు ఉదయం 10.00 గం.ల నుండి జరుపబడును. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు, జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఏడీ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, వారి కోసం పని చేస్తున్న సంఘాల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థలను ఈ సభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఆక్రమిత భూములు కాపాడాలి

- ఆర్డీవో కార్యాలయంలో టీడీపీ నాయకుల ఫిర్యాదు



ప్రజాశక్తి-గంగవరం: పలమనేరులో కబ్జాలకు పాల్పడుతున్న వైసిపి నేతలపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఆర్డీవో కార్యాలయంలో టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. పలమనేరు మున్సిపల్ పరిధిలోని గంటా ఊరు కాలనీలో లక్షల విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని కొందరు అక్రమార్కులు చదును చేసి మంగళవారం కబ్జాకు యత్నించినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కబ్జాకోరులపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆర్.బి.సి.కుట్టి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ప్రకృతి వనరులను వైసీపీ నేతలు దర్జాగా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రూ.కోట్లాది స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని, ఈ విషయం తెలిసి అధికారులు ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులే వైసీపీ నేతలకు తొత్తులుగా పనిచేస్తుండడం బాధాకరమన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ప్రభుత్వ కార్యాలయాలు సైతం కబ్జా గురై కనుమరుగయ్యే పరిస్థితులు లేకపోలేదన్నారు. కాబట్టి అధికారులు ఇకనైనా కబ్జా కోరుల నుంచి ప్రభుత్వ స్థలాలను, ప్రకృతి వనరులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అలా లేని పక్షంలో తెలుగుదేశం పార్టీ తరఫున పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఖాజాపీర్, శ్రీధర్, సుబ్రహ్మణ్యం, సుబ్బు, సురేంద్ర, సాదిక్ ఉన్నారు.

జగనన్న పాలనలో గ్రామీణ రోడ్లకు మహర్దశ

-రూ.20లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ



ప్రజాశక్తి-కార్వేటినగరం: సీఎం వైఎస్ జగన్ పాలనలోనే గ్రామీణ రోడ్లకు మహర్దశ చేకూరిందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. బుధవారం మండలంలోని కృష్ణాపురం పంచాయతీ రాచపాళ్యంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ ధనశేఖర్‌వర్మ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్లను విస్మరించి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచాయని, నేడు సీఎం జగన్ రాష్ట్రాభివృద్ధికి పట్టుకొమ్మలైన గ్రామాల అభివృద్ధికి కోట్లు వెచ్చించి అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు ఏర్పాటులో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ప్రాత ఎంతో ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన నారాయణస్వామికి గ్రామస్తుల విన్నపం మేరకు రాచపాళ్యం, క్రిష్ణాపురం దళితవాడ, క్రిష్ణాపురం, ఏఎంఆర్ కండ్రిగ గ్రామాల్లో రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మంత్రిగా ప్రజల్లో నిలిచి పోతున్నారని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని మండలాలను అభివృద్ధి దిశగా తీసుకెళుతున్న డిప్యూటి నారాయణస్వామిని రానున్న ఎన్నికల్లో ఆదరించి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనంతరం రాచపాళ్యం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పురందర్, ఎంపీడీఓ మోహన్‌మురళి, పలువురు ఉన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఈవీఎంల వినియోగంపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని ఏసిపీ రామకృష్ణుడు చెప్పారు. ఎన్నికల కమిషన్, జిల్లా ఎలక్టోరల్ అధికారి ఆదేశాల మేరకు ఏఈఆర్వో, కమిషనర్ డా.జె.అరుణ మార్గనిర్దేశంలో నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం మురుకంబట్టు, మురగానపల్లి పరిధిలోని 7, 8, 9, 11, 21, 22, 23, 25, 52 పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్లకు ఈవీఎం వినియోగంపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలు ఎలా పని చేస్తాయి? ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలి? వేసిన ఓటు నమోదు అయ్యిందా లేదా తెలుసుకోవడం ఎలా, వీవీప్యాట్ ఉపయోగం ఏమిటి అనే అంశాలపై స్థానిక ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈవీఎం పనితీరును ప్రజలు స్వయంగా తెలుసుకునేలా మాక్ ఓటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సంబంధిత బిఎల్వోలు, వార్డు కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కిషోర్



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పలమనేరు నియోజకవర్గానికి చెందిన శ్రీనివాసన్ కిషోర్ నియమితులైయ్యారు. మంగళవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో ఆయన జిల్లా బీసీ సెల్ కార్యదర్శిగా సేవలు అందించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి రావడానికి కృషి చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీ రెడ్డప్పకి, ఎమ్మెల్యే వెంకటే గౌడకి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు హేమంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, వచ్చే ఎన్నికల్లో మరొక సారి జగన్ మోహన్ రెడ్డిని సీఎం చేయడమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు.

'అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం'



ప్రజాశక్తి-రామకుప్పం: టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని టీడీపీ మండల అధ్యక్షులు ఆనందరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బందార్లపల్లి పంచాయతీలోని యానాది కాలనీలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

విద్యార్థులకు చదువే విలువైన సంపద



ప్రజాశక్తి-నగరి: చదువు చాలా విలువైన సంపదని నగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణంలో ఆంగ్ల విభాగం విద్యార్థుల తల్లిదండ్రుల సమీక్ష సమావేశం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్య చాలా విలువైనదని పిల్లలను సక్రమంగా చదివించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కొందరు విద్యార్థులు కళాశాలకు సక్రమంగా రాకపోవడం వల్ల పరీక్షల్లో తప్పిపోతున్నారని దీని ద్వారా విద్యార్థుల భవిష్యత్తు పాడైపోతుందని పేర్కొన్నారు. కొందరు తల్లిదండ్రులు డబ్బులకు ఆశపడి తమ పిల్లలను కేటరింగ్ కూలి పనులకు పంపడం ద్వారా విద్యార్థుల జీవిత నాశనానికి తల్లిదండ్రులే కారణమని ఆయన హెచ్చరించారు. తమ పిల్లలు కళాశాలకు వస్తున్నారా లేదా జులాయిగా తిరుగుతున్నారా అని తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులకు ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.పంకజ, డాక్టర్ మహేశ్వరి, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ గిరీష్, ఉమామహేశ్వరి, జ్యోతికుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి : ఎంపీపీ



ప్రజాశక్తి-కార్వేటినగరం: వైదులు నిత్యం అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ లతబాలాజీ ఆదేశించారు. బుధవారం మండలంలోని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యమైన సమాజాన్ని తీసుకొచ్చేందుకు చేపడుతున్న లక్ష్యాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. రాత్రి వేళలోకూడా వైద్య సిబ్బందితో పాటు, వైద్యాధికారి అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆక్సిజన్, పాముకాటుకు, కుక్కకాటుకు మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రోజువారి ఓపీ సరళీ రిజిస్టర్ పరిశీలించారు. ఎంపీడీవో మోహనమురళీ, డాక్టర్ భూవనేశ్వరీ, డాక్టర్ హేమశ్రీ, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తోటి వేషంతో అలరించిన భక్తులు



ప్రజాశక్తి-కార్వేటినగరం: గంగజాతరను పురస్కరించుకుని బుధవారం మొక్కులున్న భక్తులు వేసిన తోటి వేషకం పలువురిని ఆకట్టుకుంది. తూర్పు వీధికి చెందిన విశ్రాంతి ఆర్టీసీ డ్రైవర్ సుబ్రమణ్యం రాజు, విశ్రాంతి ఆర్టీసీ ఉద్యోగి క్రిష్ణయ్య. కరణం చంద్రశేఖర్, రామూర్తి, జగదీష్, తులసిరెడ్డి కలసి తోటి వేషకాలతో గ్రామ వీధుల్లో తిరుగుతూ జాతర చాటింపు వివరాలను వెల్లడిస్తూ ధండోరా వేశారు. అనంతరం శ్రీబంగారమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధ్యక్షుడు కే.ప్రసాద్ వారికి తీర్థ ప్రసాదాలను అందించారు. ఉపాధ్యాక్షుడు రంగనాథమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్పిళ్లై పలువురు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వండిపెట్టాలి : ఎంపీపీ



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: పాఠశాల విద్యార్థులు నాణ్యమైన భోజనం వండిపెట్టాలని జెడ్పీటీసీ కేశవులు, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప సూచించారు. బుధవారం మండలంలోని నెల్లిపట్లలో జెడ్పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. భోజన పథకం అమలును పరిశీలించి విద్యార్థులతో పలు విషయాలను ఆరాదీశారు. అనంతరదు ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి పలు సూచనలు చేశారు. మెరుగైన విద్యా ప్రమాణాలతో బోధించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రూప, జయకుమార్, నారాయణస్వామి, జేసీఎస్ కన్వీనర్ కార్తికేయన్, స్థానిక సర్పంచ్ చిన్న బుడ్డమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయండి




ప్రజాశక్తి-సోమల: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో నాగరాజు కోరారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మండలాల్లోని అన్ని సచివాలయాల పరధిలో పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.

సజ్జలను కలిసిన పండ్ల పరిశ్రమల యజమానులు



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామ కృష్ణారెడ్డిని బుధవారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో పండ్ల పరిశ్రమ యజమానులు కలిశారు. కట్టమంచి బాబి, విఠల్‌రెడ్డి, తల పులపల్లి బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుగుణ, శేఖర్‌రెడ్డి కలిశారు. అదేవి ధంగా ప్రభుత్వ స్కిల్ డెవెలప్మెంట్ సలహాదారులు మధుసు దన్‌రెడ్డిని కలిసి జిల్లా పండ్ల పరిశ్రమ అభివృద్ధిపై చర్చించారు.

క్రిస్మస్ సంబరాలకు రూ.50వేల విరాళం



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: గుడిపాల మండలం గుడిపాల గ్రామపంచాయతీ ఇంద్రానగర్ కాలనీలోని సిఎస్ఐ ఆల్ సైన్స్ చర్చ్‌లో ముందస్తు క్రిస్మస్ సంబరాల్లో జిజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ కార్యనిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు పాల్గొన్నారు. క్రిస్మస్ సంబరాలకు విరాళంగా రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ళ హేమాద్రి నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు తుమ్మల సాంబశివనాయుడు, మాజీ ఎంపీటీసీ రాజా, రామ్మూర్తి నాయుడు, గోపి పాల్గొన్నారు.

రసాయనికంపై విసిగి.. సేంద్రియం దృష్టి

- వ్యవసాయ పొలాల్లనే జీవామృతం తొట్టెలు నిర్మించుకుంటున్న రైతులు
- పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు
- ఒక్క నగరి మండలంలోనే 250 ఎకరాల్లో సేంద్రీయ పద్ధతిలో సాగు



పొలంలో ఏర్పాటు చేసిన తొట్టే

ప్రజాశక్తి-నగరి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సేంద్రీయ వ్యవసాయంపై రైతులు ఆశక్తి చూపుతున్నారు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రీయ ఎరువులు, పురుగుల మందులకు బదులుగా ప్రకతిలో దొరకే ఆకుల కషాయాలను వాడి సాగుచేయడానికి సిద్ధమౌతున్నారు. వేలల్లో ఖర్చయ్యే ఎరువులకు, పురుగుల మందుల వాడకానికి స్వస్తిపలికి స్వంతంగా కషాయాలను తయారు చేసుకుంటున్నారు. పంచకావ్య, బ్రహ్మాస్త్రము, అగ్నాస్త్రం, నీమాస్త్రం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, కంపోస్టు, వేపపిండి, జనుము లాంటివి వాడి సాగుచేసే పంటలనే ప్రజలకు ఆరోగ్యాన్ని ఇస్తుందన్న ఆలోచన రైతులకు కలుగుతోంది. దీంతో మెలమెల్లగా సేంద్రీయం వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. జిల్లాలోని 697 పంచాయతీల్లో 174 పంచాయతీల్లో రైతులు సేంద్రీయ పద్ధతులను అవలంభిస్తున్నారు. ఈ ఏడాదికి జిల్లాలోని 39349 మంది రైతులతో 58,850 ఎకరాల్లో సేంద్రీయ పద్దతిలో సాగుచేయడానికి ప్రకతి వ్యవసాయ శాఖ లక్ష్యాన్ని నిర్ధారించుకోగా ఖరీఫ్ సీజన్‌లో 29వేలు రైతులతో 31,500 ఎకరాల్లో సాగుచేయిస్తున్నారు. మిగిలిన లక్ష్యాన్ని రబీ సీజన్‌లో పూర్తిచేసేందుకు సిద్ధమౌతున్నారు. నగరి మండలంలోనే 250 ఎకరాల మేర సేంద్రీయ సాగు జరుగుతోంది. ఈ పద్దతులను అవలంభించడం ద్వారా భూసారం కోల్పోవడం జరగదని, దిగుబడి ఎక్కువగా వస్తుందని, భూముల్లో భూసారం పెంచే వానపాములు తయారౌతాయని ప్రకృతి వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. ఈ పద్దతిలో పండించిన పంటల్లోను వ్యత్యాసం ఉంటుందని రసాయనాలు వాడే పంటకన్నా ఈ పద్దతిలో పండించే పంట ఆరోగ్యకరమంటున్నారు. నగరి మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశెనగ చెరకు. పూలతోటలు మల్బరి, కూరగాయలపంట అంటూ 250 ఎకరల్లో సేంద్రీయసాగు జరుగుతోంది.

శాశ్వత ప్రాతిపదికన జీవామృతం తొట్టెలు

ఘనజీవామృతంను పిడకల రూపంలో తయారుచేసి నిల్వ ఉంచుకునే రైతులు ద్రవజీవామృతాన్ని ప్లాస్టిక్ తొట్టెల్లో క్యాన్లలో ఉంచుకుంటారు. అయితే ఈ ప్లాస్టిక్ క్లాన్లు చోరీలకు గురికావడంతో కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టారు. పొలానికి నీరు పారించే కాలువల పక్కనే సిమెంటు ఒరలతో 500 లీటర్ల సామర్ధ్యం ఉన్న తొట్టెలను పక్కాగా నిర్మించుకుంటున్నారు. ఈ తొట్టెలకు అడుగున కొళాయి ఏర్పాటుచేసి నీరు పారే కాలువల్లో వదిలేస్తున్నారు. ఇలా చేయడం వల్ల నీటితో కలిసి ద్రవజీవామృతం సమంగా పొలానికి పారుతూ సత్ఫలితాలు ఇస్తుండటంతో నగరి డివిజన్ పరిధిలోని మండలాల్లోనే 60 మంది రైతులు తమ పొలాల్లో శాశ్వత ద్రవజీవామత తొట్టెలను నిర్మించుకొని రాష్ట్రంలోని రైతులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.



జీవామృతం తయారు చేస్తున్న రైతులు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రకృతి వ్యవసాయం పద్దతుల్లో సాగుచేస్తే అధిక దిగుబడి రావడంతో పాటు ఆరోగ్యకరమైన పంట చేతికొస్తుంది. సేంద్రీయ ఎరువుల తయారీలో సందేహాలు ఉంటే 9502398214 నెంబరుకు సంప్రదిస్తే వారికి అవగాహన కల్పిస్తాం. వాడే విధానాన్ని రైతులకు సూచిస్తాం. **- చంద్రశేఖర్, మాస్టర్ ట్రైనర్, ప్రకృతి వ్యవసాయం.**

ఆరోగ్యకర పంటలవైపు రైతును తీసుకెళ్లడమే లక్ష్యం

సాంప్రదాయ వ్యవసాయ పద్దతులైన సేంద్రీయ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలవైపు రైతులను తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. జిల్లాలోని 30 శాతం గ్రామాల్లో రైతులకు అవగాహనకల్పించి ఈ పద్ధతులను అవలంభింపజేస్తున్నాం. భవిష్యత్తులో జిల్లా మొత్తం చేయాలన్న దృక్పథంతో ముందుకు వెళుతున్నాం. ఈ ఏడాది నిర్ణయించుకున్న లక్ష్యం వాతావరణ పరిస్థితుల ప్రభావంతో కొంత తగ్గినా రానున్న రబీ సీజనల్లో లక్ష్యం పూర్తి చేస్తాం. నగరి డివిజన్‌లో రైతులు ద్రవజీవామృతం తొట్టెలను శాశ్వతంగా నిర్మించుకొని సాగుచేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. అందరూ ఈ పద్దతిని అవలంభిస్తే మంచిదని రైతులకు సూచిస్తున్నాం. **- జి.వాసు, జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్, ప్రకతి వ్యయసాయం.**

'ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం'



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని జెసీఎస్ కన్వీనర్ కార్తీక్ అన్నారు. బుధవారం మండలంలోని నెల్లిపట్ల సచివాలయం పరిధిలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. జెసీఎస్ కన్వీనర్ కార్తీక్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వ చేయని విధంగా వైసిపి ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రైవేటు పాఠశాలకు దీటుగా పాఠశాలను ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది మెరుగైన విద్యను అందస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్‌ని మరోసారి గెలిపించాలని కోరారు. స్థానిక వైస్ ఎంపీపీ అజయ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం ప్రజలకు చేసిన కార్యక్రమాలు అన్ని గుర్తుపెట్టుకుని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, జడ్పిటిసి కేశవులు, మండలవైస్ ప్రెసిడెంట్ రామరాజు, సర్పంచ్ చిన్నబొడ్డమ్మ పాల్గొన్నారు.

ఓటరు క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేయాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



ప్రజాశక్తి-యాదమరి: దరఖాస్తులను మరొక్కసారి పరిశీలించాలని ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించి 15వ తేదీ నాటికి క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం యాదమరి తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాసిల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, బిఎల్ఓ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా 9వ తేదీ వరకు వచ్చిన క్లైమ్‌ల విషయంలో క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం 15వ తేదీ లోపల పూర్తిచేయాలని తెలిపారు.

బంగారుపాళ్యం: పారదర్శకంగా ఓటరు నమోదు చేయాలని జెసీ శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌వోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటరు ఫారం-6 నమూనా క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అవకతవకలకు తావు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలన్నారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్‌రెడ్డి, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ అనిల్‌కుమార్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మానవీయ విలువల పట్ల అవగాహన అవసరం

-డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి



ప్రజాశక్తి-కార్వేటినగరం: విద్యార్థులకు మానవీయ విలువల పట్ల అవగాహన అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన మానవీయ విలువలు, వృత్తి ధర్మాలు సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు మనవీయ విలువలను క్షుణ్ణంగా వివరిస్తూ, విలువలు పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించవచ్చన్నారు. అనంతరం ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్ పరీక్షలలో ఎలిక్స్ ఎన్విరాం మెంట్ సైన్స్ ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని పిలుపునిచ్చారు. అదే విధంగా క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థులకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కమలాకర్ రెడ్డి, డాక్టర్ వెంకటేశన్. రాజేష్కుమార్, డాక్టర్ మాధవనాయుడు సుబ్బారావు, క్రిష్ణకిషోర్, మునెమ్మ పాల్గొన్నారు.

భద్రత పెంపుపై సిఆర్పిఎఫ్ అధికారుల సమీక్ష



ప్రజాశక్తి-పుంగనూరు: బీసీవై పార్టీ సదుం మండల కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన రైతుభేరి కార్యక్రమానికి రామచంద్ర యాదవ్‌కు అవసరమనుకుంటే భద్రత పెంచే విధంగా సిఆర్పిఎఫ్ కమాండెట్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక ఎల్ఐసి కాలనీలోని సునంద నిలయంలో బెంగళూరు నుంచి వచ్చిన సిఆర్‌పిఎఫ్ కమాండెంట్ బుధవారం భద్రతా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బెంగళూరు సిఆర్పీఎఫ్ హెడ్ క్వార్టర్స్ నుంచి వచ్చిన అధికారులు భద్రతపై చర్చించారు. గతంలో సదుంలో రైతు భేరిని అడ్డుకున్న వైసిపి నాయకులు 15న నిర్వహించే రైతు భేరిని అడ్డుకునేందుకు వైసిపి ప్లాన్ చేస్తున్నదని ఎన్ని అవాంతరాలు ఎదురైనా రైతు భేరి నిర్వహించి తీరుతామని బీసీవై పార్టీ వర్గీయులు చెప్తున్నారు. అందులో భాగంగానే రామచంద్రయాదవ్ భద్రతపై కీలక సమీక్ష నిర్వహించిఅవసరమైతే అదనపు బలగాలు పంపుతామన్న సిఆర్పిఎఫ్ అధికారులు చెబుతున్నారు.

పార్లమెంటులోకి దుండగులు వెళ్లడం దురదృష్టకరం : సజ్జాద్ బాషా

ప్రజాశక్తి-పుంగనూరు: పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో దుండగులు పార్లమెంటులోకి ప్రవేశించడం దురదృష్టకరమని ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సజ్జాద్ భాష బుధవారం ఓ ప్రకటనలో ఖండించారు. పార్లమెంటు సమావేశం జరుగుతున్నప్పుడు కొంతమంది దుండగులు పార్లమెంట్ లోపలికి ప్రవేశించి హంగామా చేయడం పార్లమెంటు భద్రత వైఫల్యంపై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 140 కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే నూతన పార్లమెంట్ భవనం ప్రజలకు ఆందోళన కలిగించిందన్నారు. ఇటువంటివి జరగకుండా చూడాలి ఎంపీలకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలి దోషులను శిక్షించాలన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించరేం..

- 2వ రోజు సమ్మెలో తపాలా ఉద్యోగులు



ప్రజాశక్తి-చౌడేపల్లి: తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగాలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 2వ రోజుకు చేరుకుంది. స్థానిక పోస్ట్ ఆఫీస్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెలో ఆ సంఘ పుంగునూరు బ్రాంచ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి ప్రసంగిస్తూ సివిల్ సర్వెంట్ హోదా వెంటనే ఇవ్వాలని గ్రూప్ ఇన్సూరెన్స్ ఐదు లక్షలకు పెంచాలన్నారు. 120 రోజుల వరకు సెలవు దాచుకొని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలన్నారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫారసు చేసిన బంచింగ్ అమలు చేయాలన్నారు. జిడిఎస్ కాంట్రిబ్యూషన్ 10 శాతం డిపార్ట్మెంట్ 10 శాతం కాంట్రిబ్యూషన్ ఇవ్వాలని అలాగే తాత్కాలిక పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేవన్ కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, ముద్దప్ప, వసంతలక్ష్మి, హేమ, సుమలత పాల్గొన్నారు.